# రొమాంటిక్ అవమానం




వి. వి. సత్యప్రసాద్

నా జీవితంలో ఇంతటి అవమానాన్ని ఎప్పుడూ ఎదుర్కోలేదు! మా ఆఫీసులో పనిచేసే టైపిస్టు పద్మంత అంటే పడి చచ్చే గుణం నాలో ఏర్పడింది. పెళ్ళై పిల్లలు పుట్టాక మొదటిసారి ఒక అమ్మాయిని చూసి చలించడం! ఆమెకు పై అధికారిగా పనిచేస్తున్న నాకు ప్రతి రోజూ, ప్రతి నిమిషం అమిత పని ఏర్పడుతూ ఉంటుంది.

ఆమె సుతిమెత్తగా టైప్ చేస్తున్నా, డౌట్స్ క్లియర్ చేసుకోవడానికి (నా రైటింగ్ అర్థంకాక) నవ్వుతూ నా దగ్గరకు వచ్చినా, "మిస్ పద్మా!" అని పిలవగానే కళ్ళు చక్రాల్లా తిప్పుతూ నా వేపు చూసినా నాలో అణుచుకోలేని ఏవో కోరికలూ, అనుభూతులూ మొలకెత్తుతూ ఉంటాయి. పిరికివాణ్ణయి ఏమీ మాట్లాడలేక నిర్లిప్తంగా ఉండడం ప్రతి రోజూ యాతనగా ఉంది.

నేను జోక్స్ వేసినప్పుడు ఆమె గలగలా నవ్వుతుంది. నాకు పెళ్ళైనట్టు ఆమెకు తెలుసు. పెళ్ళి కానట్టు ఉండడంకూడా నా కిష్టం లేదు.

"ఏదో ఒకటి ధైర్యం చేసి అడిగేద్దాం" అనే ధైర్యం నాలో ఏర్పడినా, ఒక పక్క అధికరిగా ఉంటూ 'ప్రెస్టీజ్' పోతుందేమో అనే భయం, ఆమె ఎటువంటి 'రిప్లై' ఇస్తుందో అనే సంశయం, ఆమెకు చులకన అయిపోవచ్చనే బిడియం . . .ధైర్యం చేయనీయడం లేదు. పోనీ, ఏదో అవకాశం చూసుకుని. . . సినిమాల్లో హీరోయిన్లని బలవంతం చేసేవాళ్ళు నా కంటే చాలా రెట్లు మెరుగు అనిపిస్తుంది.

రాను రాను ఆమె మీద మోజు బలంగా పెరుకుంటూంది నాలో. అప్పుడప్పుడు 'హింట్స్' ఇస్తున్నాను— అర్థం చేసుకుంటుందేమో అని.

"మీరు నవ్వినప్పుడు బాగుంటారు"..."ఈ చీర మీకు బాగా నప్పింది"...ఇలాంటివి.

కనీసం థాంక్స్ నా చెప్పకుండా నవ్వి ఊరుకునేది. గుండె మరికొంచెం ఏడ్చేది.

ధైర్యం చేసి 'స్వవిషయాలు' [illegible]డ్డానికి ఒక అనువైన ప్లాను వేశాను.

ఆమె యూనివర్సిటీ కాంపస్ బస్ స్టాప్ దగ్గర దిగి, ఎడం చేతివైపు వీథిలో ఒక అర మైలు నడిచి ఇంటికి వెడుతుందట. ఓ సాయంత్రం నేనూ అదే బస్ ఎక్కి, ఆమెతోపాటు అరమైలూ నడిచి, నడుస్తూ నా ఏడుపు ఏడుస్తూ బతిమాలుదామనుకున్నాను. 'ధైర్యే సాహసే లక్ష్మీ' అనుకుంటూ ముహూర్తం చూసి ఓ రోజు నంబరు మూడో బస్ దగ్గర తచ్చాడుతున్నాను.

ఆమె వచ్చింది. బస్ కోసం ఎదురు చూస్తుండగా నన్నుకూడా చూసింది. చూసి చిన్నగా నవ్వింది. నేనూ తీపిగా నవ్వాను. బస్ వచ్చాక ఆమె ఎక్కేదాకా చూసి, అదే బస్ నేనూ ఎక్కాను. ఆమె ఆడవాళ్లకు కేటాయించిన జాగాలో కూర్చుంది. నేను ఒక్కణ్నే కూర్చు న్నాను వెనకాల ఎక్కడో.

కండక్టరుకి ఏ స్టేజ్ లో దిగాలో చెప్పక, మాక్జిమమ్ టిక్కెట్ కి డబ్బి చ్చేశా. ఆమె దిగిన చోటే దిగిపోయాను. ఆమె ఏమీ పట్టించుకోకుండా, కనీసం వెనకవైపు చూడకుండా విసవిసా నడిచి వెళ్లిపోతూంది. వెనకాం అనుసరించ డానికి గుండెబలం చాల్లేదు. దారినిపోయే వాళ్లు చూసి ఏదైనా అనుకుంటారేమో అని కాస్సేపు, తెలిసిన వాళ్లెవరైనా చూస్తే అసహ్యంగా ఉంటుంది, చెడ్డ పేరు వస్తుందన్న భయం కాస్సేపు— ఆ అమ్మాయి ఏమైనా అనుకోవచ్చునే భయం కాస్సేపు. రకరకాల సందేహాలు... మెల్లగా పిల్లిలా తడబడుతూ అడుగు లేస్తున్నాను.

నిర్మానుష్యంగా, చీకటిగా ఉన్న ఒక చోట మెల్లగా పిలిచాను "మిస్ పద్మా!" అని.


ఆమె వెనక్కి తిరిగి నవ్వుతూ చూసి, "సారీ, మీరొస్తే వస్తున్నారని అనుకో లేదు. . . ఎక్కడిదాకా?" అని అడిగింది.

ఎక్కడిదాకా? . . . నాకే తెలియ లేదు.

"ఊరికే ఇలా వస్తున్నాను. ఈ ఏరియా ఎలా ఉంటుందో చూద్దామని!" అన్నాను ఏం చెప్పాలో తోచక.

మళ్లీ గలగలా నవ్వింది. "మీరు ఇకేనారే" అంది.

"చూడండి. . . మీతో. . ." మెల్లగా నసుగుతున్నాను.



ఇక వద్దు...

చిత్రం—శేషగిరి (క్యాప్షన్-18)

"వద్దండి— మీరు చెప్పబోయేది నాకు తెలుసు. మీ ధోరణిబట్టే ముందే గ్రహించాను. నా కిటువంటివి చాలా అనుభవాలు జరిగాయి. అందుకని ఎవ రేది చెప్పినా, చెబుదామని ప్రయత్నించినా నవ్వి ఊరుకోవడం తప్పితే, చెప్పిన వాళ్లకి ఫలితమూ లేదు; విన్న నేనూ ఏం చేయలేను!. . . ఆఫీసులో పొద్దుటినుండి సాయంత్రందాకా కలిసి పని చేస్తాం. ఏమైనా ఆఫీసు విషయాలైతే అక్కడే మాట్లాడు కుందాం. వ్యక్తిగత విషయాలైతే నా కనవసరం! సారీ. . ." అంది.

మసక చీకటిలోకూడా ఆమె ముఖం గంభీరంగా ఉండడం చూసి క్షణం నేను కొయ్యబారిపోయాను. నోట మాట రాలేదు. మాటెగా చెప్పేసింది మరో మాట మాట్లాడ్డానికి తావీయకుండా.

"మిమ్మల్ని పలకరించినందుకు క్షమించండి!" అనేసి రుమాలుతో ముఖం తుడుచుకుంటూ నడక వేగాన్ని హెచ్చించాను.

"ఆగండి. . . అంత సీరియస్ అయిపోయా రెందుకు? ఎలాగూ ఇంత దూరం వచ్చారు. మా ఇంటికి రండి, కొంచెం కాఫీ తాగి వెడుదురు గాని. . . మా నాన్నగారికి పరిచయం చేస్తాను."

"వద్దండి. థాంక్స్. . . మీ ఫాదర్ ఏమైనా అనుకోవచ్చు."

"అదేం లేదు. ఇంత దూరం వచ్చి మీరు మా ఇంటికి రాకపోతే నేను ఇంకా అనుకోవలసి వస్తుంది. మీరు మామూ లుగా ఒక స్నేహితుని ఇంటికి వచ్చినట్టుగా వస్తే ఎవరూ ఏ విధంగానూ అనుకోవలసిన పని ఉండదు. రండి. . . సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడుద్దాం. . . ఏమైనా మామూలు కబుర్లు చెప్పండి."

"మీరు నన్ను ఇబ్బంది పెట్టేస్తు న్నారు."

"మీరు నన్ను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించలా?" సన్నగా నవ్వింది.

నా ముఖం క్షణ క్షణానికీ ముడుచు కుంటూంది. విధిలేక ఆమెను అనుసరిం చాను.

ఇంటికి తీసుకుని వెళ్లింది. సమయానికి వాళ్ల నాన్నగారు లేరు. మంచి స్ట్రాంగ్ కాఫీ ఇచ్చి ఆ ఏరియాలో ఉన్న ఇబ్బందు లని, ఆర్. టి. సి. బస్ వాళ్ల దయా దాక్షిణ్యాలని చెప్పింది. నేను యాంత్రికంగా అన్యమనస్కుడనై వింటున్నాను.

ఇంతలో హఠాత్తుగా పిడుగు పడ్డట్టు మా రిటర్న్స్ క్లార్క్ సోమేశ్వరం అక్కడికి వచ్చాడు. వస్తూనే నవ్వుతూ, "హలో, సార్! ఏమిటి ఇలా వచ్చేరు? క్వైట్ సర్ప్రైజింగ్!" అన్నాడు.

జేగురించిన ముఖాన్ని దాచుకుంటూ మెల్లిగా నవ్వాను.

'ఇప్పుడే దాపురించాలా వీడు!' అని తిట్టుకున్నాను.

సోమేశ్వరం గోడ దగ్గరున్న కుర్చీని వాల్చుకుని కూర్చున్నాడు.

"ఇతని ఇల్లు ఈ ముందు వీథిలో ఉందండి. వీళ్ల ఫామిలీ, మా ఫామిలీ ఒకే కుటుంబంలా ఉంటాం!" అంది పద్మలత.

"అలాగా!" అన్నాను.

"ఏ రిటువైపు ఏదో పనిమీద వస్తూంటే మా ఇంటికికూడా రమ్మని ఆహ్వానించాను" అంది సోమేశ్వరంతో.

నేను పద్మలత వేపు విస్మయంగా చూశాను. పద్మలత చాతుర్యానికి మనసులో అభినందించాను. ఎంత మంచిది! పాపం, ఇటువంటి అమ్మాయి మీద దురుద్దేశాలు పెట్టుకోవడంలో ఎంత పొరపాటు చేశాను! ! నా దురుద్దేశాన్ని గ్రహించి కూడా నా పరువు కాపాడింది. ఛీ.... ... ఈ వెధవ మనస్సుని అదుపులో పెట్టుకోవాలి. మా ఆవిడ మాత్రం ఏం తక్కువని అనుకున్నాను.

సోమేశ్వరంతోను, పద్మలతతోను కాసేపు కబుర్లు చెప్పి సెలవు తీసుకుని బయటికి నడిచాను.

సాదరంగా కాంపౌండ్ గేట్ దాకా వచ్చి బస్ స్టాప్ చూపించింది.

నా జీవితంలో ఇటువంటి పరిస్థితి ఎదుర్కోవడం నాకు మొదటిసారి. ఇది చాలా డెలికేట్ అవమానం! అయితేనేం? అడదంటే నా కిప్పుడు పూర్తిగా అర్థమయింది. *